రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని వైఎస్ఆర్ బాక్సింగ్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ మైదానంలో జరిగిన వైఎస్ఆర్ కడప జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికల్లో గెలుపొందిన వారు ఈ నెల 13, 14వ తేదీలలో విజయవాడ లయోలా కాలేజీ లో నిర్వహించనున్న ఆంధ్ర రాష్ట్ర బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా తరఫున 50, 55 కిలోల లోపు తిరుపతి ఆంజనేయులు, 55 నుంచి 60 కిలోల లోపు షేక్ మహమ్మద్ అలీ, 60 నుంచి 65 కిలోల లోపు శ్రీనివాసులు తలారి, 70 నుంచి 75 లోపల చిత్తా రవికాంత్ ఎంపికయ్యారని చెప్పారు. జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్య వహిస్తారని పేర్కొన్నారు. బాక్సింగ్ ఎంపికలకు ముఖ్య అతిథిగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి గౌస్ మొహిద్దీన్ హాజరయ్యారు.

నేడు మేయర్ ఎన్నిక!

- ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- వైసిపి మేయర్ అభ్యర్థిగా పాకా సురేష్

పాకా సురేష్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప కార్పొరేషన్ మేయర్ ఎన్నిక నిర్వహణ షురూ అయింది. ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం మేయర్ ఎన్నిక నిర్వహణకు కసరత్తు చేసింది. ఈనెల ఏడవ తేదీలోపు కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు, కో-ఆప్షన్ మెంబర్లకు మేయర్ ఎన్నిక నిర్వహణకు సంబంధించిన నోటీసులు జారీ చేసింది. జెసి ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేయడం దగ్గర నుంచి ఎన్నిక నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల యంత్రాంగం పూర్తి చేసింది. మాజీ మేయర్ కె.సురేష్‌బాబు మరోసారి హైకోర్టు ఆశ్రయించడంతో ఉత్కంఠ నెలకొంది. బుధవారం ఉదయం 10 గంటలకు హైకోర్టు తీర్పు వెలువరిస్తుందనే వార్త మేయర్ ఎన్నికపై ఉత్కంఠను కలిగించింది. మధ్యాహ్నానంతరం హైకోర్టు మాజీ మేయర్ వేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో ఎన్నిక ఖాయమైంది. జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం గురువారం 11 గంటల నుంచి మేయర్ ఎన్నిక ప్రక్రియను చేపట్టనుంది. కార్పొరేషన్‌లోని 50 మంది కార్పొరేటర్లలో జంపింగ్‌లు, మృతులు పోనూ 39 మంది కార్పొరేటర్లతో కూడిన పూర్తిస్థాయి ఆధిక్యత వైసిపికి ఉన్న సంగతి తెలిసిందే. తాత్కాలిక మేయర్ ముంతాజ్‌బేగం స్థానంలో నూతన మేయర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం ఎస్.బి.అంజాద్‌బాషా, మాజీ మేయర్ కె.సురేష్‌బాబు బుధవారం రాత్రి కడప ఎంపీ స్వగృహంలో కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. గురువారం నిర్వహించబోయే ఎన్నికల ఫలితంపై స్పష్టత లభించేలా రిహార్సల్స్ తరహాలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మేయర్ పదవి ఆశావహులు 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్, 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లి, 36వ డివిజన్ కార్పొరేటర్ బసవరాజు మధ్య పోలింగ్ విధానంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించినట్లు సమాచారం. పాకా సురేష్‌కు మెజార్టీ ఓట్లు లభించడంతో ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సమాచారం.

12న అంగన్వాడీల సమస్యలపై ఆందోళన

- ఎఐటియుసి, సిఐటియు నాయకులు

మాట్లాడుతున్న ఎఐటియుసి, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, 12న రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని ఎఐటియుసి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్.నాగసుబ్బారెడ్డి, బి.మనోహర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదగర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుంచి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదని, రాష్ట్రంలో మిగిలిన 1810 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేసే సెంటర్ నిర్వహణకు ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం చేయాలని 2023, డిసెంబర్‌లో 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించారని తెలిపారు. సమ్మె విరమణ సందర్భంగా 2024 జూలైలో అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని మినిట్స్ ఇచ్చారని అయినా నేటి వరకు వేతనాలు పెంచలేదన్నారు. రాష్ట్రంలో ఇటీవల 4687 మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇచ్చినందుకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఇంకా 1810 మినీ సెంటర్లలో క్వాలిఫికేషన్ లేదని మెయిన్ సెంటర్లుగా మార్చలేదని కొంత మంది మినీ వర్కర్లకు 10వ తరగతి పాసైనా మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయలేదన్నారు. గ్రాట్యుటీ జిఒ నెంబర్3ను సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గైడ్‌లైన్స్ రూపొందించలేదని, సంక్షేమ పథకాలు అమలుకావడంలేదు, హెల్పర్ల ప్రమోషన్లో రాజకీయ జోక్యం వలన అర్హులకు ప్రమోషన్లు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పనిచేయనందువల్ల ఫేస్ యాప్, ఆన్‌లైన్ వర్క్ చేయటానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం ఇస్తున్న స్నాక్స్ ఆపివేశారని గుర్తు చేశారు. అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్చి వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని పెండింగ్‌లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీచేయాలి లబ్ధిదారులకు ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని, మెనూ ఛార్జీలు పెంచి ఉచితంగా గ్యాస్ సరఫరా ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి 5 సంవత్సరాల్లోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్లో ఉండాలని జిఒ ఇవ్వాలన్నారు. సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు మంజుల, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు కృషి చేయాలి

- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

మాట్లాడుతున్న నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారానికి కడప, కమలాపురం ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతకొమ్మదిన్నె మండలంలోని చెర్లోపల్లి లే అవుట్ రహదారి సమస్య ఏడాది కాలంగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉందన్నారు. చెర్లోపల్లి రహదారి సమస్య పరిష్కరించాలని జిల్లా అధికార యంత్రాంగానికి అనేకసార్లు వివిధ రూపాల్లో విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన లే అవుట్ కే రహదారి ఏర్పాటు చేయకపోతే ఇంకెవరిని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో పోరాటం చేసినా స్పందన లేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి జోక్యం చేసుకుని కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలంఖాన్‌పల్లి వద్ద ఉన్న దస్తగిరిపేటలో శ్మశాన వాటిక మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు అనేక సార్లు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కడప ఎమ్మెల్యే మాధవి జోక్యం చేసుకుని తక్షణమే ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల పరిధిలో ప్రజలు సమస్యలతో బాధపడుతుంటే స్పందించకుండా ఉండటం సమంజసం కాదన్నారు. తక్షణమే చెర్లోపల్లి లే అవుట్ రహదారి సమస్య, దస్తగిరిపేట శ్మశానవాటిక మురుగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, నాయకులు నాగేళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

- కమిషనర్‌కు నోటీసు అందజేసిన నాయకులు

కమిషనర్‌కు నోటీసు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

జనవరి 2026 లోపు చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాలని, తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలని, 60 సంవత్సరాలు నిండిన వారి కుటుంబంలోని వారికి ఆప్కాస్ ఉద్యోగం ఇవ్వాలని, లేనిపక్షంలో కడప నగరంలో సమ్మెకు వెళ్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు (సిఐటియు అనుబంధం) డిమాండ్ చేశారు. బుధవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల కార్పొరేషన్‌లో 60 సంవత్సరాలు నిండిన వారిని రిటైర్మెంట్ పేరుతో ఇంటికి పంపించారని పేర్కొన్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీలో వివిధ జిల్లాలలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చారని తెలిపారు. కడప కార్పొరేషన్ పాలకవర్గం రోస్టర్ పద్ధతి తీసుకున్న రావడం సరైన పద్ధతి కాదని చెప్పారు. తక్షణం ఈ రోస్టర్ పద్ధతిని ఉపసరించుకునిపై సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చెత్త పన్ను వసూలు చేశారని కొంతమంది శానిటేషన్ మేస్త్రీలను, వర్కర్లను విధుల నుంచి తొలగించారని, ఐదు నెలలు అవుతున్నా ఇంత వరకు విధులకు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేషన్ సెకరెటరీలను సస్పెండ్ చేసి తిరిగి వారిని విధులకు తీసుకున్నారని పేర్కొన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత మున్సిపల్ కార్మికులని విధులకు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుంకర రవి, జిల్లా ఉపాధ్యక్షులు ఇత్తడి ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ పాల్గొన్నారు.

బాధ్యతలను సమానంగా స్వీకరించాలి : విసి

ప్రజాశక్తి-కడప అర్బన్

మాట్లాడుతున్న విసి రాజశేఖర్

పుస్తక పరిజ్ఞానంతో పాటూ సామాజిక అంశాల పట్ల అవగాహన పొందాలని, హక్కులు బాధ్యతలను సమానంగా స్వీకరించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. వైవీయూ రాజకీయ శాస్త్రం, ప్రజా పరిపాలన విభాగం సహా ఆచార్యులు, సదస్సు కన్వీనర్ డాక్టర్ బి.ఆర్.సతీష్ బాబు అధ్యక్షతన బుధవారం అన్నమాచార్య సెనేట్ హాల్లో నిర్వహించారు. 75 సంవత్సరాలలో మానవ హక్కులు' అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన స్వతంత్ర పరిశోధకురాలు, ఆల్ ఇండియా ఫెమినిస్ట్ అలయన్స్ సభ్యురాలు డాక్టర్ ఎ.సునీత కీలక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ ప్రమీల, ఆచార్య పార్వతి, ఆచార్య ఎం.అనిత, పిఎస్అండ్ ఎస్పిఎ అధ్యాపకులు డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ దామోదర్, డాక్టర్ రామయ్య, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఎంసి చైర్మన్, వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

కడప ఎఎంసి చైర్మన్, వైస్ చైర్మన్‌గా షేక్ హుస్మాన్ ఘని, రాజు వెంకటసుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు బుధవారం మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డ్ అధికారి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటామని, పదవి ఇచ్చిన ఎమ్మెల్యే మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైస్ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవి నుంచి తమకు గుర్తింపు వచ్చిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో కేసులు పెట్టి వేధించారని చెప్పారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కష్టపడే వారికి పదవులు గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవర్ధన్‌రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన కె.వి.సుబ్బారావు

ప్రజాశక్తి - బద్వేలు

టిడిపిలో చేరిన సుబ్బారావు, నాయకులతో రితీష్‌రెడ్డి

ఆర్యవైశ్య వర్తక సంగం మాజీ అధ్యక్షులు, శ్రీదేవి, భూదేవి ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కె.వి.సుబ్బారావు టిడిపిలో చేరారు. బుధవారం సుబ్బా రావు స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రితీష్‌రెడ్డి సమక్షంలో టిడిపి కండువా వేసుకున్నారు. సుబ్బారావు ఆధ్వర్యంలో 30 కుటుంబాలు టిడిపి కండువా కప్పుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య, బద్వేల్ మున్సిపాలిటీ టిడిపి ఇన్‌ఛార్జి వెంగల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కనుమర్లపూటి ప్రసాద్, స్వామి, లాయర్ ప్రసాద్, రాయమాను ప్రతాప్, జహంగీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రితీష్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపి ఆశయాలు నచ్చి సుబ్బారావు టిడిపిలో చేరి తనతోపాటు అనేక కుటుంబాలు చేరడం సంతోషకరంగా ఉంద న్నారు. సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, లోకేష్ పాలనలో తమదైన శైలిలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని, వారితోపాటు నియోజకవర్గ అభివృద్ధికి రితీష్‌రెడ్డి అహర్నిశలు కష్టపడుతున్నారని, వారి అడుగుజాడలలో తాము కూడా నడిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య ప్రముఖులు, ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు కానిస్టేబుళ్ల శిక్షణకు సన్నాహాలు

- శిక్షణ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పి

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఇటీవల ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల(ఎస్‌సిటిపిసి)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డిటిసి) బుధవారం ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ సందర్శించారు. ఈ సందరేగా శిక్షణా కేంద్రంలోని వసతి ఏర్పాట్లను, కిచెన్ రూమ్, తరగతి గదులను, కార్యాలయ గదులను, మైదానం, అంతర్గత రహదారులను, బాటిల్ అబ్స్టాకల్స్ ను పరిశీలించారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిటిసి డిఎస్పి అబ్దుల్ కరీం, డి.టి.సి ఇన్స్పెక్టర్ ఎస్.వినయ్ కుమార్ రెడ్డి, ఆర్.ఎస్.ఐ అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

13న లేబర్ కోడ్స్‌పై సెమినార్

ప్రజాశక్తి-కడప అర్బన్: లేబర్ కోడ్స్, రాజ్యాంగ హక్కులపై 13న సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటి ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు కమిటీ జిల్లా కన్వీనర్ ఎ.రఘునాథ రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా తెలిపారు. బుధవారం ఎల్ఐసి యూనియన్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం సెమినార్ బ్యానర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ అమల్లోకి రావడం వల్ల యూనియన్స్ ఏర్పాటు కష్టమవుతుందన్నారు. త్యాగమయ పోరాటాలతో సాధించుకున్న 8 గంటల పనిదినం చరిత్ర గర్భంలో కలిసిపోతుందన్నారు. కార్మికోద్యమాలను బలహీనం చేసేందుకే ప్రభుత్వం లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఉన్న రాజ్యాంగ హక్కులపై కూడా దాడి జరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో లేబర్ కోడ్స్, రాజ్యాంగ హక్కులపై ఈ నెల 13న డిసిసి బ్యాంకు మీటింగ్ హాల్‌లో సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సెమినార్‌లో ముఖ్య వక్తలుగా ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఆంధ్రా, తెలంగాణ, కరా?టక రాష్ట్రాల సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, న్యాయవాది సంపత్ కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఈ సెమినార్‌ను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ రంగాల నాయకులు అవధానం శ్రీనివాస్, అక్బర్ బాషా, శ్రీకృష్ణ, వారిజాతమ్మ, శ్రీనివాసులు, రాజు (ఇన్సూరెన్స్), శ్రీనివాసులురెడ్డి, జగదీష్ (బ్యాంకింగ్), కామనూరు శ్రీనివాసులురెడ్డి (సిఐటియు), రామానుజులరెడ్డి (మెడికల్ రెప్స్), వెంకటరామరాజు (సిరికల్చర్), నరసింహారెడ్డి (మెడికల్) పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - కడప: మానవహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, స్టెప్ మేనేజర్ వి.వి.సుబ్బరాయుడు, మాజీ మెజిస్ట్రేట్ వరప్రసాద్ అన్నారు. స్టెప్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదడు మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో సహాయపడేందుకు మనం తీసుకునే సమాచారాన్ని వర్గీకరిస్తుంది, సులభతరం చేస్తుందన్నారు. మానవులందరూ స్వేచ్ఛగా, గౌరవం, హక్కులలో సమానంగా జన్మించారని మనం అంగీకరించవచ్చున్నారు మతం, జాతి, రంగు, లింగం, భాష, లైంగిక ధోరణి, వయస్సు లేదా హోదాతో సంబంధం లేదని తెలిపారు. 1948, డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను ఆమోదించింది, దీని జ్ఞాపకార్థం ఈ రోజును అంతర్జాతీయంగా జరుపుకుంటారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక థీమ్‌తో ఈ రోజును నిర్వహిస్తారు, ఇది మానవ హక్కుల ప్రాముఖ్యతను వివిధ కోణాల్లో తెలియజేస్తుంది అన్నారు. ఈ సంవత్సవం థీమ్ మన రోజువారీ అవసరాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం మా కళాశాలలో నిర్వహించడం ద్వారా విద్యార్థులు మనవ హక్కుల గురించి తెలుసుకుంటారని, ఇటువంటి కార్యక్రమాలు స్టెప్ వారు నిర్వహించడం వల్ల యువతకు అవగాహనా కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమములో కళాశాల విద్యార్థినులు దాదాపు 250తో పాటు కళాశాల అధ్యాపకులు, స్టెప్ సిబ్బంది ఎస్.అబ్బాస్ అల్లి, టి.నాగయ్య పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణకు అపూర్వ స్పందన

- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలో మెడికల్ కళాశాలల నిర్మాణం, నిర్వహణ, ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో చేపట్టాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజల నుండి అనూహ్య స్పందన లభించిందని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. ప్రజలు చేసిన సంతకాల ప్రతులను బుధవారం వైసిపి జిల్లా కార్యాలయానికి చేర్చారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా, మాజీ మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అనూహ్య స్పందన లభించిందని తెలిపారు. నియోజకవర్గంలో 70 వేల మంది ప్రజలు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. మహిళలు, విద్యార్థులు, రైతులు, నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే విధంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైసిపి డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.నాగార్జునరెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బద్వేలు: ఈ నెల 31 నుండి జనవరి 4, వరకు వైజాగ్‌లో ఐదురోజుల పాటు జరగబోయే సిఐటియు అఖిల భారత18వ మహా సభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్ర అన్నారు. బుధవారం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అమలుచేయాలని చూస్తున్న లేబర్ కోడ్స్ వల్ల ఆధునిక బానిసలుగా మార్చే విధంగా బిజెపి కార్మిక చట్టాలలో మార్పులు చేసిం దని పేర్కొన్నారు. ఆ మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాలు నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయకుండా పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎనిమిది గంటల పనిని 12 గంటలకు పెంచటం దానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా అమోదం తెలిపిందన్నారు. కనీస వేతనాలు జీతాలు పెంచాలని కార్మికులు, స్కీం వర్కర్లు కోరుతూ ఉంటే, పెంచకపోగా, కార్మికుల పని గంటలు పెంచ డంతో, వేతనాలు తగ్గిపోయాయన్నారు. యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, పిఎఫ్, ఇఎస్ఐ గ్రా డ్యూటీ, నిర్వీర్యం అవుతుంద న్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్మిక అనుకూల విధానాలు తెస్తామని చెప్పి ఇప్పుడు పెట్టుబడి దారులకు అనుకూల విధనాలు అనుసరిస్తున్నారని, కార్మికులతో పెట్టుకున్న ప్రభు త్వాలేవి మనగడలో లేవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పులి శ్యామ్ ప్రవీణ్, పట్టణ కో-కన్వీనర్ పిసి.కొండయ్య, కమిటీ సభ్యులు దియ్యాలహరి, కాలువ శివకుమార్, పట్టణ నాయకులు ముడియం చిన్ని, షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్, సగిలి రాయప్ప, షేక్ ఖైరూన్ బీ, గంప అనంతమ్మ, పసుపుల మోక్షమ్మ, మూర ప్రసాద్, తుడుం వెంకటపతి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని మార్చొద్దు

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని ఎగువ రామాపురం ఎస్‌సి కాలనీ పోలింగ్ కేంద్రం ఎగువ రామపురంలోనే ఉంచాలని వైసిపి ఐటి వింగ్ ప్రెసిడెంట్ బాసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రెడ్డిపల్లి పంచాయతీలో కలపవద్దని, కలపాలనుకుంటే ఎలాగైనా అడ్డుకుంటామని పేర్కొన్నారు. ఎగువరామాపురంలో అన్ని వసతులు ఉన్నాయన్నారు. స్కూల్, ఆస్పత్రి, సచివాలయం, ఉపాధి, మంచి ఆహ్లాదకరమైనన జీవనం ఉన్నాయని పేర్కొన్నారు. మూడు కిలోమీటర్లు వెళ్లి మేము ఓటు వేయలేమన్నారు. రామాపురం ఎస్సీ కాలనీ ఇప్పుడు చేస్తున్న రెడ్డిపల్లి గంగయిపల్లిలో కలపవద్దని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

బొటానికల్ గార్డెన్ వద్ద సాయిబాబు హైస్కూల్ విద్యార్థులు

బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి-కడప అర్బన్: నగరంలోని సాయిబాబా హైస్కూల్ విద్యార్థులు యోగి వేమన యూనివర్సిటీలో ఉన్న బొటానికల్ గార్డెన్‌ను బుధవారం సందర్శించారు. ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా బొటాని విభాగం అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు గార్డెన్ ప్రాధాన్యత, పర్యావరణ సమతుల్యములో మొక్కల పాత్ర, వివిధ ఔషధ మొక్కల ప్రత్యేకతలను వివరించారు. విద్యార్థులు మొక్కల వర్గీకరణ, విత్తన సంరక్షణ, అరుదైన జాతుల పరిశీలన విషయాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద వాటర్ లిల్లీ పాండ్ విద్యార్థులను ఆకట్టుకుంది. ఆర్ట్స్, క్రాఫ్ట్ విభాగాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, రవితేజ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో అధ్యక్షులు ప్రతాప్, కోచ్ విజయ్

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎపి స్టేట్ జెన్ సిటీ రూ కరాటేడో అసోసియేషన్ వారు కర్నూలులోని ఎంఎస్ఎంఎస్ ఫంక్షన్ హాల్ బనగానపల్లిలో జిల్లా స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఇందులో కడప విద్యార్థులు15 మంది పాల్గొన్నారు. 15 గోల్డ్ మెడికల్స్, 9 సిల్వర్ మెడల్స్, 4 బ్రాంజ్ మెడల్స్ వివిధ కేటగిరీలో సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరాటే కోచ్ విజయ్, కరాటే అసోసియేషన్ ఆఫ్ ఎపి ప్రెసిడెంట్ డాక్టర్ కోలా ప్రతాప్ అభినందించారు.

రవీంద్రనాథ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - కడప: కళాశాల విద్య నూతన ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్‌కు బుధవారం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.రామకృష్ణ, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నీలయ్య మాట్లాడుతూ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది యొక్క సర్వీస్ సమస్యలను పరిష్కరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భూగర్భ శాస్త్ర అధ్యాపకులు చెన్న ప్రసాద్, పరీక్షల విభాగం సిబ్బంది వరుణ్ విశ్వనాథ్ నాయక్, రంగస్వామి, శ్రీనివాసులు, శరత్ బాబు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్‌ను సన్మానిస్తున్న అధికారులు

రేషన్ ఇవ్వలేదంటూ డిటికి విన్నవిస్తున్న రాణివనం కాలనీ వాసులు

రేషన్ ఇవ్వాలంటూ వినియోగదారులు నిరసన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పదో తారీకు వచ్చినా తమకు రేషన్ ఇవ్వలేదని స్థానిక రాణివనం కాలనీ మహిళలు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కాలనీ వాసులకు 11వ నెంబర్ రేషన్ షాపులో రేషన్ ఇస్తుండేవారు. ఆ షాపు యజమాని రేషన్ సరిగా ఇవ్వడం లేదని, బ్లాక్‌లో అమ్ముకుంటున్నాడని ఆరోపిస్తూ నిరసన తెలిపారు. గత నెలలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రేషన్ షాపును సీజ్ చేశారు. అనంతరం ఇతరులకు రేషన్ షాపును అప్పగించి రేషన్ పంపిణీ చేశారు. ప్రస్తుతం ఆ రేషన్ షాపు ఇతరులకు మంజూరైంది. ఇప్పటివరకు రేషన్ పంపిణీ ప్రారంభం అవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం బుధవారం డిప్యూటీ తహశీల్దార్ కిషోర్‌కు విన్నవించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ జాయింట్ కలెక్టర్ నుంచి తమకు మ్యాపింగ్ అందలేదన్నారు. ఒకటి రెండు రోజులలో మ్యాపింగ్ అవుతుందని, అనంతరం రేషన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 15వ తేదీ దాటితే రేషన్ ఇవ్వరూ కదా అని లబ్ధిదారులు అడగ్గా, ఆలస్యమైనా లబ్ధిదారులు అందరికీ రేషన్ పంపిణీ చేస్తామని డిటి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాణివనం వాసులు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, మదార్ బి, పీరమ్మ, గైబుసా, పర్వీన్, శాంత పాల్గొన్నారు.

సెల్ టవర్ కోసం సిజిఎంకు వినతి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని బక్కన్నగారిపల్లె గ్రామంలో ఉన్న ప్రజలకు మెరుగైన మొబైల్ సేవలు కల్పించేందుకు బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయాలని బిఎస్ఎన్ఎల్ ఛీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలంకు వినతిపత్రం అందజేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం విజయవాడలోని ప్రాంతీయ కేంద్రంలో సిజిఎంకు బక్కన్నగారిపల్లె వైసిపి యువనేత బుక్కే రమేష్ నాయక్ వినతిపత్రం అందజేశారు. మారుమూల ప్రాంతమైన బక్కన్నగారిపల్లెలో ఫోన్ సిగ్నల్ సమస్య ఉందని, దీంతో ఆ ప్రాంతంలో ఉన్న గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సిజిఎం దృష్టికి తెచ్చారు. టెక్నాలజీ యుగంలో కూడా సిగ్నల్ సమస్య ఉందని విన్నవించారు. సర్వే తర్వాత వెంటనే ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చినట్లు బుక్కే రమేష్ నాయక్ తెలిపారు.

సిజిఎంకు వినతిపత్రమిస్తున్న రమేష్ నాయక్

నేడు చాపాడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చాపాడు

చాపడు మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపిపి టి.లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వీరకిషోర్ తెలిపారు. మండలస్థాయి అధికారులు పూర్తి నివేదికతో హాజరుకావాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గ్రామాల్లో గుర్తించిన సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరుకావాలని, వారి కుటుంబ సభ్యులు, ఇతరులకు ప్రవేశం లేదన్నారు. ముందస్తు సమాచారం లేకుండా అధికారులు సమావేశానికి గైర్హాజరైతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ తెలిపారు.

కార్యాలయ ప్రారంభంలో ఎంపిడిఒ గంగాదేవి, నాయకులు

గ్రామ సచివాలయ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - వేముల

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గ్రామ సచివాలయాల పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం నూతనంగా మండల కేంద్రాల్లో గ్రామ సచివాలయాల కార్యాలయాలను ప్రారంభిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో నూతన మండల గ్రామ సచివాలయాల పర్యవేక్షణ కార్యాలయాన్ని టిడిపి నేత పేర్ల శేషారెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ కుమార్ రంగయ్య, కృష్ణయ్య, డిప్యూటీ తహశీల్దార్ జగదీష్ బాబు, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి ఎంపిడిఒ గంగాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు, గ్రామ సచివాలయ సిబ్బంది, టిడిపి నేతలు పాల్గొన్నారు.

కల్వర్టు గుంతలు పూడ్చాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఎస్ఆర్‌సి కన్స్ట్రక్షన్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. జమ్మలమడుగు నుండి పెద్దముడియం వెళ్లే దారిలో రోడ్డు కల్వర్టు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ భారీ గుంతలు తీసి వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఏమాత్రం సేఫ్టీ ప్రికాషన్స్ పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. నిత్యం రద్దీగా ఉండే దారిలో ప్రమాదకరంగా గుంతలు తీసి వదిలేశారని తెలిపారు. జాతీయ రహదారిలో సిమెంటు లారీలు భారీగా తిరుగుతుంటాయన్నారు. స్కూల్ బస్సులు, ప్రస్తుతం పనుల కాలం కాబట్టి రైతు కూలీలతో ఆటోలు వెళుతున్నాయని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జమ్మలమడుగు పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్, పట్టణ కమిటీ సభ్యులు రాఘవేంద్ర పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ఎదురుగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ముద్దనూరు వైపు నుంచి వస్తున్న వాహనాన్ని ఆర్టీసీ బస్సు క్రాస్ చేయబోయి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కరణ్ (25), వినాయక్ (25) అక్కడికక్కడే మృతి చెందారు. వీరు మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లాకు చెందిన వారు. జవారి ప్రకాశంలో కాంట్రాక్టర్ వద్ద బేల్దార్ కూలీలుగా పనికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ నాగమురళి పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడిపత్రి జాతీయ రహదారి ఏ ఓబాయపల్లి దుర్గమ్మ గుడి వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వల్లూరు గ్రామానికి చెందిన గంగన్న రోడ్డు దాటుతుండగా కడప నుంచి వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కాలు విరిగింది. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

యురేనియం ప్రభావిత ప్రజలకు న్యాయం చేస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప/కడప అర్బన్/వేముల

యురేనియం ప్రభావిత గ్రామాల ప్రజలకు న్యాయం చేస్తామని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం ఆయన తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యుసిఐఎల్) సమస్యలపై మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి, ప్రాజెక్టు అధికారులు, పులివెందుల డివిజన్ రెవెన్యూ అధికారి, కేకే కొట్టాల గ్రామస్తులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన యుసిఐఎల్ ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించి కేంద్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. యురేనియం ప్రభావిత గ్రామాల సమస్యలు, వారి ప్రతి పాదనలను పరిశీలించి కేంద్రానికి నివేదిస్తామన్నారు. స్థానిక సమస్యలను పరిగణనలో తీసుకుని, ప్రాజెక్టు అవసరాలు, నిర్వహణ, సామర్థ్యం దృష్ట్యా కొత్త టెయిలింగ్ పాండ్ నిర్మాణం చేపట్టడానికి ముందే ల్యాండ్ కమిటీని ఏర్పాటు చేసి కేకే కొట్టాల గ్రామాన్ని భూసేకరణ చేపట్టేందుకు చర్యలు చేపడ తామన్నారు. దీనిపై పబ్లిక్ నోటిఫికేషన్ కూడా ఇస్తామన్నారు. ఇందుకు దాదాపు 6 నెలల సమయం పడుతుందన్నారు. నిర్వహణలో ఉన్న పాత టెయిలింగ్ పాండ్ ఎత్తును పెంచుకునేందుకు కానీ, ఏదైనా మరమ్మతులు చేపట్టేందుకు కానీ ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. దేశాభివృద్ధి, ఉత్పాదక ప్రయోజనాల కోసం స్థానికులు తమ సొంత భూములు, సొంత నివాసాలను వదులుకోవడం త్యాగంతో కూడుకున్న విషయమే అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ఊరిని కోల్పోతున్న యురేనియం ప్రభావిత గ్రామస్తులకు చట్టపరంగా, న్యాయ పరంగా జిల్లా యంత్రాంగం సహకరిస్తుందన్నారు. గతంలో పరిహారంతోపాటు ఇంకా కొంతమందికి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ కల్పన కూడా త్వరలో క్లియర్ చేయాలని యూసీఐఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా సామాజిక బాధ్యతగా గ్రామాల్లో మౌలిక అవసరాలను కల్పించేందుకు, మెడికల్ క్యాంపులు, పారిశుధ్య అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావాలని, ఆ దిశగా ఆయా గ్రామ ప్రజలకు సహకారం అందించాలని యూసీఐఎల్ యాజమాన్యానికి కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య, యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్, యుసీఐఎల్ సూపరింటెండెంట్ ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్ నవీన్‌కుమార్ రెడ్డి, విజయ్ కుమార్, పీకే నాయర్ పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

సొంత స్థలం కలిగి ఉండి అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజారత్నం తెలిపారు. మైదుకూరులోని హౌసింగ్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైదుకూరు అర్బన్ పరిధిలో 222 గృహాలు మం జూరయ్యాయన్నారు. మైదుకూరు రూరల్ పరిధిలో 3,850 మం జూరయ్యాయని, ప్రస్తుతం సిబ్బంది అర్హులను గుర్తిస్తున్నారన్నారు. అర్బన్ పరిధిలో ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ముక్కొండ లేఔట్ వద్ద 2,200 ఇళ్లు గత ప్రభుత్వంలో మం జూరు కాగా, కొన్ని పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సిబ్బంది అవినీతికి పాల్ప డితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తప్పు చేయని వారికి శాఖపరంగా అండగా ఉంటామన్నారు. మైదుకూరులో తమ శాఖ సిబ్బంది సహకారంతో కొంతమంది అసత్య ప్రచారాలు చేస్తు న్నారన్నారు. గతంలో స్టీలు నిల్వల్లో తేడాలు ఉన్నట్లు విజిలెన్స్ తనిఖీలో గుర్తించారన్నారు. కాంట్రాక్టర్ వద్ద కొంత, గోడౌన్లో మరికొంత నిల్వలు ఉండడంతో ఇబ్బందులు ఎదుర య్యాయన్నారు. విజిలెన్స్ డిఇ విచారించి పూర్తిస్థాయిలో స్టీలు అందు బాటులో ఉందని డిఇఇ హౌసింగ్, ఈఈ మార్చి 19న గోడౌన్‌లో, ఆన్‌లైన్‌లో స్టీలు సరిసమానంగా నిల్వ ఉందని నివేదిక ఇచ్చారన్నారు. కొంత మంది పదేపదే తప్పుడు ఫిర్యాదులు ఉన్నతాధికారులకు ఇస్తుండడంతో కలెక్టర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈని విచారణకు నియమించారన్నారు. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక కలెక్టర్‌కు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు ఎవరైనా సిబ్బంది తప్పు చేసి ఉంటే చర్యలు తీసుకుంటారన్నారు. గోడౌన్లలో పూర్తిస్థాయిలో స్టీలు అందు బాటులో ఉందని, ఎవరికైనా అనుమానాలు ఉంటే పరిశీలన చేయవచ్చని తెలిపారు. ఎవరైనా ఆధారాలు ఉంటే ఫిర్యాదులు చేయాలన్నారు. మైదు కూరు ప్రాంత ప్రజలం అంటూ తప్పుడు ఫోన్ నెంబర్లతో ఫిర్యాదులు చేస్తే అలాంటి వారిపై కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు. కడప జిల్లాను గృహ నిర్మాణంలో అగ్రస్థానంలో నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రాజారత్నం

వికలాంగుల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వికలాంగుల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని వెలుగు ఎపిఎం ఆంజనేయులు తెలిపారు. అంతర్జాతీయ వికలాంగుల వారోత్సవాల్లో భాగంగా హ్యూమన్ రైట్స్ డేను ముద్దనూరు రోడ్డులోని విక లాంగుల కమ్యూనిటీ భవనంలో ఏపీ దివ్యాంగుల నెట్వర్క్ ఆధ్వర్యంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఐ సీతారామిరెడ్డి 30మందికి దుప్పట్లు పం పిణీ చేయించారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, వేముల వెలుగు సహాయ ప్రాజెక్టు మేనేజర్ దేరంగుల ఆంజనేయులు, పట్టణ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్స్ వి.శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, వికలాంగుల సంఘ కార్యవర్గ సభ్యులు సాయికుమార్, బషీర్, ఖదీర్ పాల్గొన్నారు.

వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

చక్రాయపేట : వికలాంగులను చిన్నచూపు చూడవద్దని నాగలగట్టుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగమునిరెడ్డి పేర్కొన్నారు. ఇందుకు నిదర్శనం జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో వారు అందుకున్న ప్రశంసా పత్రాలు, మెడల్స్ నిదర్శనమన్నారు. నాగలగట్టుపల్లె భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా నాగమునిరెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఐఈఆర్‌టి ఉపాధ్యాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగుల విద్యార్థులకు అలవెన్సులు 60 మందికి వారి తల్లిదండ్రుల ఖాతాలో జమ చేశారన్నారు. భవిత కేంద్రంలో పిల్లలకు అవసరమైన పరికరాలను మెడికల్ క్యాంపు ద్వారా అందజేయుటకు కృషి చేస్తామని లలిత హామీ ఇచ్చారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.ధర్మారెడ్డి తమ వంతుగా దివ్యాంగ విద్యార్థులకు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ వైద్యురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం నాగమునిరెడ్డి

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దుర్మార్గం

సంతకాల సేకరణ పత్రాలను ఎమ్మెల్సీకి అందజేస్తున్న వల్లంబాయి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం దుర్మార్గమని వైసిపి నాయకులు పేర్కొన్నారు. పిపిపిని వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ప్రజాఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి జెండా ఎగర వేస్తామని పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని కన్నెలూరుకు చెందిన వైసిపి జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వల్లంబాయి హృషీకేశవ రెడ్డి అదే గ్రామంలో 2,500పైగా సేకరించిన సంతకాల పత్రాలను పార్టీ ఇన్‌ఛార్జి పి. రామ సుబ్బారెడ్డికి అందజేశారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల ప్రజా ఉద్యమం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పొన్నపురెడ్డి గిరిధర్ రెడ్డి, వల్లంబాయి హృషీకేశవరెడ్డి, రజక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోగిడి జయన్న, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి గజ్జల లక్ష్మయ్య, సత్తకారి శివ సుబ్రమణ్యం, మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

చాపాడు (మైదుకూరు) : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేపట్టడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి తెలిపారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో 70 వేల సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం మైదుకూరు పట్టణంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యం పేదలకు సొంతం చేయాలన్న ఉద్దేశంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తితో జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఉప ఎంపిపి రఘురామిరెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, లింగన్న, శివరాం, రాఘవరెడ్డి, వీరారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, సిద్ధారెడ్డి, జ్వాలా, సుధాకర్‌రెడ్డి, కిరణ్మయి, తవ్వా వెంకటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



మైదుకూరులో వైసిపి చేపట్టిన భారీ ర్యాలీ

వనిపెంట ఇత్తడి పరిశ్రమ గుర్తింపునకు కృషి

చాపాడు (మైదుకూరు) : మైదుకూరు మండలం వనిపెంట ఇత్తడి పరిశ్రమకు రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చేలా అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర హస్త కళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన ఇత్తడి పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ అనేక రకాల ఇత్తడి కళాఖండాలను అద్భుతంగా కళాకారులు తయారు చేస్తున్నారన్నారు. ప్రజల్లో ఇత్తడి ఉత్పత్తులకు ఆదరణ ఉందన్నారు. ఆ మేరకు మార్కెటింగ్ చేపట్టేందుకు ప్రభుత్వ సహ కారం అందేలా చూస్తామన్నారు. ఆయనను నాయకులు, కళాకారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, ఇత్తడి కళాకారుల సం ఘం నాయకులు ఇస్మాయిల్, కళాకారులు, నాయకులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

నా పేరు వడ్ల చంద్రశేఖర్ తండ్రి సుబ్బరాయుడు, నేను మైదుకూరు నుండి కడపకు వెళ్లాలని ఆర్టీసి బస్టాండుకు వెళుతుండగా దారి లో పాస్ పోర్టు పోయినది. నా పాస్ పోర్టు నెం. V3140868 ఈ నెంబర్ గల పాస్ పోర్టు దొరికినచో ఈ క్రింది తెలిపిన అడ్రస్సుకు చేర్చగలరు.
వడ్ల చంద్రశేఖర్, s/o సుబ్బరాయుడు, డోర్ నెంబర్.11 / 268-3, బద్వేల్ రోడ్డు, మైదుకూరు టౌన్, వైఎస్ఆర్ కడపజిల్లా.
సెల్ : 6301217165.

భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వినియోగించాలి

ప్రజాశక్తి - వేముల

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని ఎఒ జిపి ఓబులేస్ సూచించారు. సిద్ధంరెడ్డిపల్లి, గొల్లల గూడూరు, పెద్ద జూటూరు గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ రబీ పంటల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఆఖరి దుక్కులో భాస్వరం వంటి సూటి ఎరువులు వాడి ఖర్చు తగ్గించుకోవాలని తెలిపారు. తగిన యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మిరెడ్డి, సెరి కల్చరల్ సిబ్బంది, ఎఇఒ సురేష్, రైతుసేవా సిబ్బంది మల్లిక, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

చాపాడు (మైదుకూరు) : రబీ పంటల సాగుపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మైదుకూరు మండలం నంద్యాలంపేట పరిధిలోని పెద్దశెట్టిపల్లె, లోకాయపల్లె గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎఒ ఇ.బాల గంగాధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ దృష్ట్యా సాగుచేసిన మొక్కజొన్న, మినుము, టమోటా పంటలు, వాటి స్థితిగతుల గురించి రైతులతో చర్చించారు. వరి పంట కోత దశలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి గురప్ప, వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని జంగంరెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనులు చేపట్టిన సందర్భంగా గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరగుంటపల్లి, అంకాలమ్మ గూడూరు, జంగం రెడ్డిపల్లి, రావులకొలను సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ, ఇళ్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి శ్రీజగన్మాత ఈశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ఈశ్వరీదేవి మఠంలో గురువారం నుంచి అమ్మవారి ఆరాధన, గురుపూజ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీవీంబ్రహ్మేంద్రస్వామి మఠం పక్కనే ఈశ్వరీదేవి మఠం ఉంది. బ్రహ్మోత్సవాలు ఈనెల 16 వరకు అమ్మవారి ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 18న మార్గశిర బహుళ నవమిన సజీవ సమాధి నిష్ఠ వహించిన రోజు సందర్భంగా ప్రధాన వేడుకలు నిర్వహి స్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి ప్రజలు తరలివస్తారు.

వైభవోపేతంగా ఉత్సవాలు..

అమ్మవారి ఆశీస్సులతో ఏటా ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు శిష్యులు, భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి బి.వి.జగన్మోహన్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో ప్రజలు తరలిరవాలని ఆకాంక్షిస్తున్నాం.

- శ్రీవీరశివకుమార స్వామి, మఠాధిపతి, ఈశ్వరీదేవిమఠం

వసంతపేట పాఠశాలలో జిల్లా జడ్జి తనిఖీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక మున్సిపల్ వసంతపేట ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా జడ్జి యామిని తనిఖీ చేశారు. ఇటీవల ఈ పాఠశాలలో కలుషిత ఆహారం తినడం వల్ల 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఈ ఘటనపై జిల్లా జడ్జి తనిఖీ చేశారు. ఉపాధ్యాయులను, వైద్యులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా జడ్జి వెంట లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, డిఇఒ శంషుద్దీన్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి పాల్గొన్నారు.

పారిశుధ్యం.. అధ్వానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని సిరాజుపల్లె గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఆ గ్రామ ఎంపిటిసి సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ వెంకటరమణయ్య దృష్టికి తెచ్చారు. ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉప మండల అధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు-2 పొన్న శీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. సిరాజుపల్లె ఎంపీటీసీ మాట్లాడుతూ ఆరు నెలలుగా ఎక్కడ వేసిన కసువు అక్కడే ఉండిపోయిందన్నారు. దుర్గంధంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎంపీడీవో స్పందిస్తూ పంచాయతీ తరపున పనిచేసేందుకు కార్మికులు ఆ గ్రామంలో దొరకడం లేదన్నారు. త్వరలో కార్మికులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వైకోడూరు సర్పంచ్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు సంబంధిత హౌసింగ్ అధికారులు ఇవ్వడంలేదన్నారు. రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి నివేష నిర్ధారణ పత్రం(పొజిషన్ సర్టిఫికేట్) తేవాలని చెప్పారని అన్నారు. గతంలో 25 ఇళ్లు మంజూరుకాగా, అధికారులు ఇలా చేయడంతో 18 ఇళ్లు లబ్ధిదారులకు అందలేదని తెలిపారు. ఎంపీడీవో వెంకటరమణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కలిగేలా సంబంధిత అధికారులు వారి వద్దకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్యోత్స్న, ఏపీఎం జగదీశ్వరి, ఏపీవో గంగా భవాని, ఐసిడిఎస్ అధికారి ఓబులమ్మ, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఆర్అండ్‌బి ఎఇ అభిలాష్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణయ్య

మహారాజశ్రీ కడప మూడవ అదనపు జూనియర్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 527/2025

వి. పల్లవి, కడప. ... వాది

Vs

Smt. K.M.Rani @ K.Mariya Rani
W/o Jojaiah Naidu, aged 60 Years, Working as S.G..Teacher, MPP School, Mydukur (M), Kadapa District. Resinding at D.No.43/217-1-10, Prakash Nagar, Kadapa. .. ప్రతివాది

ప్రతివాదికి దావా నోటీసు

వాది ప్రతివాదిపై ప్రో నోట్ బాండు వసూలు చేసుకొనుటకు పై దావా దాఖలు చేసి ఉన్నారు. కనుక మీరు **22/12/2025**వ తేదీన ఉదయం 10.గం॥ 30॥లకు పై కోర్టులో స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా హాజరై ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు లేని యెడల పై దావాను పరోక్షముగా తీర్మానించబడును.

//By Order of the Court//
శ్రీ జి. శ్రీనివాసులు నాయుడు
ఎ.వి. రమణ
అడ్వకేట్స్, కడప.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

E.A.No.72/2024
EP.No. /2023
O.S.No. 49 /2012

1. ఎ. రహంతుల్లా (పోతి వారసులు)
2. ఎ.ఎస్. పీరు తండ్రి లేట్ ఎ. రహంతుల్లా, ముస్లిం, 23 సం॥లు డోర్ నెం. 24/528-1, గాంధీరోడ్డు, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా అండ్ వగైరాలు.

... పిటిషనరు/డిహెచ్ఆర్ఎస్

Vs.

3. షేక్ నజరుమే శారద భర్త లేట్ ఖాజామస్తాన్, 43 సం॥లు డోర్ నెం. 11-23-8, దంతవారి వీధి, కావలి టౌన్, నెల్లూరు జిల్లా.
4. షేక్. షెహనాజ్ C/o జనుల్, 39 సం॥లు డోర్ నెం. 22/180. వసంతపేట వీధి, ప్రొద్దుటూర్ టౌన్, వైఎస్ఆర్ కడప జిల్లా.

...3,4 రెస్పాండెంట్లు/ జెడిఆర్ నెం.3,4.

నోటీసు

పై నెంబరు పిటిషను 1వ రెస్పాండెంట్/ జెడిఆర్ నెం.1 అయిన షేక్. గౌసియా గారు గతించినందున ఆమె తరుపున వారసులైన మిమ్మల్ని చేర్చకోరుచూ పిటిషన్ దాఖలు చేసి ఉంటున్నారు. అట్టి పిటిషన్‌లో 3,4 రెస్పాండెంట్లు/ జెడిఆర్ నెం. 3,4 అయిన మీరు హాజరు అగుటకు గాను **07-01-2026**వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు పై కోర్టులో ఉదయం 10.30 ని॥లకు ఖుద్దున్న గానీ, వకీలు ద్వారా గానీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేదీ : 07-01-2026

//By Order of the Court//
శ్రీ జి. శ్రీనివాసులు, Bcom.,BL
అడ్వకేట్,
ప్రొద్దుటూరు

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

I.A.No.1076/2024
O.S.No. 373 /2018

యమ్మనబోయిన ప్రసన్నమూర్తి, తండ్రి లేట్ వై. పక్కీరయ్య, హిందూ, వయస్సు 50 సం॥లు, వ్యాపారం, సాకిన్ డోర్ నెం. 12/152, ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా మైదుకూరు టౌన్ మరియు మండలం, కడప జిల్లా.

... పిటిషనరు/వాది

Vs.

3. రోసిగాల్ల ప్రవళ్ళిక, తండ్రి లేట్ రోసిగాల్ల జయప్రతాప్, వయస్సు 35 సం॥లు, హిందూ, గృహిణి.
4. రోసిగాల్ల ప్రత్యూస్ కుమార్, తండ్రి లేట్ రోసిగాల్ల జయప్రతాప్, వయస్సు 33 సం॥లు, హిందూ, ప్రయివేట్ ఎంప్లాయి
ఇద్దరు సాకిన్ డోర్ నెం. 24/1208, ఈశ్వరయ్యవీధి, జమ్మలమడుగు టౌన్ మరియు మండలం, కడపజిల్లా.

...3,4 రెస్పాండెంట్స్

3,4వ రెస్పాండెంట్స్ నోటీసు

పై నెంబరు పిటిషనులోని పిటిషనరు 1వ రెస్పాండెంట్ రోసిగాల్ల జయప్రతాప్ చనిపోయినందున, అతని వారసులైన మిమ్ములను మరియు ఇంకా ఇద్దరిపై దావాలో ప్రతి వాదులుగా చేర్చమని కోరుచూ పై పిటిషన్‌ను దాఖలు చేసి ఉన్నారు. అట్టి పిటిషనులో 3,4వ రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు కొరకు **20-01-2026**వ తేదీన వాయిదా ఉంటున్నది. పైప పిటిషనులో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల **20-01-2025**వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు యందు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మాణించబడును.

వాయిదా తేదీ : 20-01-2026

//కోర్టువారి ఉత్తర్వు మేరకు//
కె.జె.భాస్కర్‌రెడ్డి
అడ్వకేట్, ప్రొద్దుటూరు